# మినీకథ



# దటీజ్

కుప్పిలి వెంకట సుబ్బారావు

మాణిక్‌లాల్ అండ్ కంపెనీలో క్లార్కు పోస్టులకు ఇంటర్వ్యూ జరుగుతోంది. కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్ గిరిధర్. చీఫ్ పర్సనల్ ఆఫీసర్ మురళి ఇంటర్వ్యూ కండక్ట్ చేస్తున్నారు. ప్యూను ఒక్కొక్కళ్ళ పేరే పిలుస్తున్నాడు. బయట బెంచీలమీద కూర్చొనున్న కేండిడేట్స్ నుంచి ఒక్కొక్కరే లేచి వెళ్తున్నారు. లోపలనుంచి ఒక్కో కేండిడేటు తిరిగొస్తున్నప్పుడల్లా, అతని చుట్టూ కొంతమంది ప్రోగయి. "ఏమేం అడుగుతున్నారు?" అని అడుగుతున్నారు. అతను చెబుతున్నాడు. అడుగుతున్నవి రెండుమూడు ప్రశ్నలే అయినా, అన్నీ కష్టమైనవే! ఇంటర్వ్యూ చాలా టఫ్‌గావుంది అని అందరికీ అర్థమయిపోయింది.

"కె. కేశవరావ్ అని కేకేశాడు ప్యూను.

కేశవరావు షర్టు బటన్స్ అవీ సర్దుకొని లోపలికెళ్ళాడు.

"గుడ్ మార్నింగ్ సర్స్" అన్నాడు వినయంగా.

"బీ సీటెడ్" అన్నాడు గిరిధర్.

"థాంక్యూ సర్" అంటూ కూర్చున్నాడు కేశవరావు.

"మిస్టర్ కేశవరావ్! ఇల్లు చూసి ఇల్లాలు గురించి చెప్పొచ్చంటారు. మొఖం చూసి మనిషెలాంటి వాడో కూడ కొంతవరకు చెప్పొచ్చు. అలాగే కొన్ని వూళ్ళ పేర్లు నువ్విప్పుడు చెప్పాలి!

సీ. ఒక కిళ్ళీ కొట్టు!.. ఇద్దరు వ్యక్తులు సిగరెట్లు కొనుక్కోవడానికి అక్కడ కొచ్చారు. "అలంకార్"లో ఏం ఆడుతోంది?" కిళ్ళీ కొట్టు ఓనరు అడిగాడు అందులో ఒకడిని. వాడేదో చెప్పాడు. రెండవవాడు "అది కాదు" అంటూ మరేదో చెప్పాడు "కాదు" అన్నాడు మొదటివాడు. "ప్చ్ నీకు తెలీకపోతే వూర్కో" అన్నాడు రెండవవాడు. వాగ్వివాదం పెరిగిపోయింది "ఎవఁడ్రా నువ్" అంటూ మొదటివాడు జేబులోంచి చాకుతీసి రెండవవాడి కడుపులో ఒక్కపోటు పొడిచాడు. అంతే! ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా రెండోవాడు అక్కడే అరటి గెలకు గ్రుచ్చి వుంచిన కత్తి తీసుకుని మొదటివాడి డొక్కలో పొడిచాడు. ఇద్దరూ అక్కడికక్కడే చచ్చిపోయారు. అక్కడ ఏమీ జరగనట్టు కిళ్ళీకొట్టు ఓనరు అప్పటికి కిళ్ళీకొట్టు కట్టేసి. మామూలుగా ఇంటికెళ్ళిపోయాడు భోంచేసి రావడానికి. కెన్ యూ టెల్ మీ విచ్ ప్లేస్ ఈజ్ దట్ ఇన్ ఆంధ్రా?"

"దటీజ్...." కేశవరావు చెప్పాడు.

"వెల్ ఒక సిటీ బస్సు స్టాప్. అయిదు సిటీబస్సులకు సరిపడాజనం వున్నారక్కడ. ఆత్రంగా బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. పది నిముషాలకో బస్సుందంటారు అధికారులు కానీ అరగంటకో బస్సు రావడం కూడ గగనమే. మొత్తానికో బస్సువచ్చింది. ఆగకుండానే పోయింది. మరో గంటకి రెండు బస్సులొచ్చాయి ఒక్కసారే. అప్పటికి పది బస్సులకు సరిపడా జనం పోగయి వున్నారు. గమ్మత్తుగా అందరూ బస్సుల్లోకి ఎక్కారు. ఒక్క పుట్‌బోర్డు మీదే ఓ బస్సుకు సరిపడా జనం వ్రేళ్ళాడుతూ వున్నారు. అలాగే కిటికీలు పట్టుకొని.... బస్సులు బయలుదేరాయి అక్కడక్కడా ఆగివున్న వాహనాలను తప్పుకుంటున్నప్పుడు. వాహనాలను ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు గోతుల్లోంచి ప్రయాణం చేస్తున్నప్పుడు పుట్‌బోర్డు మీద జనం. కిటికీలకు వ్రేళ్ళాడుతున్న జనం పిట్టల్లా నేలరాలిపోతున్నారు. కాళ్ళు. చేతులు విరిగిన వాళ్ళకు విరుగుతున్నాయి. చచ్చిన వాళ్ళు చస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు కెన్ యూ..."

"దటీజ్...." చెప్పాడు కేశవరావు.

"లాస్టలీ.... ఓ అరడజను మంది మనుషులు. ఓ వ్యక్తిని వెతుక్కుంటూ ఓ హోటలోకి వెళ్ళారు. సదరు వ్యక్తి మరో పార్టీకి చెందినవాడు. ఈ మధ్య జరిగిన ఎలక్షన్సులో అవతల పార్టీకి అతను చేసిన సేవ వల్ల ఆ పార్టీ గెలిచింది అలాంటి వాడిని ఇప్పుడు వాళ్ళు పట్టుకోవాలి. ఒకడి చేతిలో సైకిలు చైను. మరొకడి చేతిలో ఇనుప రాడ్. అలాగే మిగిలిన వాళ్ళ చేతుల్లో ఏవో మారణాయుధాలు వున్నాయి. తమకు కావలసిన వ్యక్తి హోటల్లో లేకపోవడంతో, అక్కడే వున్న సినిమా హాలులోకి వెళ్ళారు. అక్కడా దొరకలేదు. మళ్ళీ రోడ్డుమీద కొచ్చారు. ఏదో బస్సు వెళ్తోంది. బస్సుని ఆపారు. లోపల వెతికారు. వాళ్ళకి కావావలసిన మనిషి అందులోనే వున్నాడు. జుట్టు పట్టుకొని క్రింది కీడ్చుకొచ్చారు. ఒక్కొక్కడూ ఒక్కొక్క దెబ్బ! వాట్సదట్...."

"దటీజ్ ...." కేశవురావు చెప్పాడు. మురళి ఏ ప్రశ్నలు అడగలేదు. కేశవరావు "థాంక్స్" చెప్పి బయటకెళ్ళిపోయాడు.

"మీ కేండిట్ వున్నాడన్నారు. ఇతనేనా?" గిరిధర్ నడిగాడు మురళి 'అందుకేనా, ఇలాంటి సింపుల్ క్వొశ్చన్స్ అడిగారు? అన్న అర్థంలో.

"యస్" అన్నట్లు నర్మగర్భితంగా తలాడించాడు గిరిధర్.

ఇంతకీ కేశవురావు చెప్పిన జవాబులు: "దటీజ్ హైదరాబాద్! దటీజ్ విశాఖపట్టణం? దటీజ్ విజయవాడ!"